# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

జూన్ 13, 2011

## భారత విప్లవోద్యమ సీనియర్ నేత, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ జగదీష్ మాస్టర్ ఎలియాస్ భూపేష్‌జీని బేషరతుగా విడుదల చేయాలి!

## కామ్రేడ్ జగదీష్ మాస్టర్ అరెస్టుకూ, విప్లవోద్యమంపై దోపిడీ పాలక వర్గాలు సాగిస్తున్న ఫాసిస్టు అణచివేతకూ వ్యతిరేకంగా

## జూన్ 23న 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!

కామ్రేడ్ 'జగదీష్ మాస్టర్'గా బీహార్ పీడిత ప్రజానీకానికి సుపరిచితుడు, సీపీఐ (మావోయిస్టు) పోలిట్‌బ్యూరో సభ్యుడు, పార్టీ సీనియర్ నేతల్లో ఒకరైన కామ్రేడ్ భూపేష్‌జీని బీహార్‌లోని గయా జిల్లాలో గురార్ అనే చోట జూన్ 11న పోలీసులు అరెస్టు చేశారు. 72 సంవత్సరాల వయోవృద్ధుడు, దాదాపు పదేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతూ ప్రజల మధ్య, ప్రజా పోరాటాలే వూపిరిగా జీవిస్తున్న కామ్రేడ్ భూపేష్‌జీ వైద్యం కోసం వెళ్తున్న క్రమంలో సాదా బట్టల్లో వచ్చిన బీహార్, కేంద్ర ఫాసిస్టు ఇంటలిజెన్స్ గూండాలు ఆయనను అరెస్టు చేశారు. తాము పాటిస్తామని చెప్పుకునే రాజ్యాంగాన్నీ, చట్టాల్నీ తామే వుల్లంఘిస్తూ 24 గంటలు దాటినప్పటికీ ఆయనను కోర్టులో హాజరు పర్చకుండా రకరకాల హింసలకూ, వేధింపులకూ గురి చేశారు.

పార్టీ శ్రేణులలో 'కామ్రేడ్ భూపేష్‌జీ' పేరుతో సుపరిచితుడైన కామ్రేడ్ జగదీష్ మాస్టర్ గత నాలుగు దశాబ్దాలుగా విప్లవోద్యమ నిర్మాణం కోసం ఎనలేని కృషి చేసిన ముఖ్యమైన నాయకుడు. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కాలంలో భారత విప్లవోద్యమ మహా నేతల్లో ఒకరైన అమరుడు కామ్రేడ్ కన్నయ్య చటర్జీ ప్రేరణతో విప్లవ రాజకీయాల వైపు ఆకర్షితుడై 1970ల తొలినాళ్ల నుండి పూర్తికాలం విప్లవకారుడిగా పని ప్రారంభించాడు. భూస్వామ్య దోపిడీకి, పీడిత కులాల ప్రజలపై అగ్రకుల భూస్వామ్య సేనల బర్బర దాడులకు నెలవుగా వున్న బీహార్‌లో ఆయన పీడిత ప్రజల సమరశీల నాయకుడిగా నిలబడి ఎన్నో ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఈ అరెస్టు ద్వారా నయా భూస్వాములైన నితీష్ కుమార్, సోనియా–మన్మోహన్‌సింగ్–చిదంబరంల ముఠా బీహార్ రైతాంగాన్ని తిరిగి చీకటి యుగాల్లోకి తీసుకుపోదల్చారు. భూస్వాముల నుండి వేలాది ఎకరాల భూముల్ని స్వాధీనం చేసుకొని భూమిలేని, పేద రైతాంగానికి పంచడంలో, వాళ్లపై సాగే సామాజిక అణచివేతను ఎదిరించి వాళ్లు ఆత్మగౌరవంతో తలెత్తుకొని తిరగగలిగే స్థితిని తీసుకురావడంలో కామ్రేడ్ భూపేష్‌జీ పాత్ర ఎంతో గొప్పది. వృద్ధాప్యాన్నీ, తీవ్ర అనారోగ్యాన్నీ లెక్క చేయకుండా శత్రువు చేతికి చిక్కేంత వరకూ ప్రజల మధ్యనే జీవిస్తూ ప్రజలకూ, కేడర్లకూ, నూతన తరాలకూ వుత్తేజాన్నీ, ప్రేరణనూ అందిస్తూ వచ్చిన కామ్రేడ్ భూపేష్‌జీ అరెస్టు ప్రజలకూ, విప్లవ శ్రేణులకూ ఎంతో బాధాకరమైంది.

మావోయిస్టు విప్లవోద్యమాన్ని అతి పెద్ద శత్రువుగా పరిగణిస్తున్న దేశ పాలకవర్గాలు దానికి నాయకత్వం వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర నాయకుల్ని అరెస్టు చేయడం, ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపడం వంటి హేయమైన చర్యలకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా గత రెండు సంవత్సరాలుగా 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో సాగిస్తున్న దేశవ్యాప్త దాడిలో భాగంగా ఒకవైపు కీలక నాయకత్వాన్ని టార్గెట్ చేసి దెబ్బ తీస్తూనే మరోవైపు వుద్యమ ప్రాంతాల్లో ఫాసిస్టు దమనకాండను కొనసాగిస్తున్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో విచ్చలవిడిగా నిరాయుధ ప్రజల్ని కాల్చి చంపడం, గ్రామాలను కాల్చివెయ్యడం, మహిళలపై అత్యాచారాలు, ఆస్తుల విధ్వంసం, లూటీ, తీవ్రంగా కొట్టడం, అక్రమ కేసులలో జైలుపాలు చేసి ఏళ్ల తరబడి విచారణ, జామీను లేకుండా మగ్గిపోయేలా చెయ్యడం వంటి మధ్య యుగాల క్రూర అణిచివేత పద్ధతుల్లో, నాజీ తరహా ఫాసిస్టు రూపాల్లో ఈ దాడి – ఆపరేషన్ గ్రీన్‌హంట్ – కొనసాగుతున్నది. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బీహార్, బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, వుత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని విప్లవోద్యమ ప్రాంతాలు పోలీసు, పారామిలిటరీ బలగాల ఇనుప బూట్ల కింద నలిగిపోతున్నాయి.

జనవరి 2011 నుండి రెండో దశగా చెబుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ప్రభుత్వాలు ఒక వైపు గ్రామాలపై, ప్రజలపై బీభత్సకర దాడులకు పాల్పడుతూనే, మరోవైపు ఈ దాడికి వ్యతిరేకంగా గొంతు విప్పిన రచయితలనూ, కళాకారులనూ, ప్రజాస్వామికవాదులనూ, మానవహక్కుల కార్యకర్తలనూ అణిచెయ్యడానికి పచ్చి ఫాసిస్టు దాడులకు పాల్పడుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ప్రజా డాక్టర్, మానవహక్కుల కార్యకర్త డాక్టర్ బినాయక్ సేన్‌కు యావజ్జీవ శిక్ష విధించడం; చింతల్‌నార్ ప్రాంతంలో ప్రభుత్వ

సాయుధ బలగాలు సాగించిన విచ్చలవిడి బీభత్సకాండను ప్రత్యక్షంగా పరిశీలించడం కోసం వెళ్లిన స్వామి అగ్నివేష్ తదితరులపై దాడి; పీయూసీఎల్‌పై నిషేధం విధిస్తామనే బెదిరింపులు; రచయితలపై, పత్రికా విలేకరులపై తప్పుడు కేసులు బనాయించడం, దాడులకు పాల్పడడం; ఒడిషాలో కార్పొరేట్ కంపెనీలు పాల్పడుతున్న బలవంతపు భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా వుద్యమిస్తున్న ప్రజలపై దమనకాండ; ఎన్‌కౌంటర్ల పేరుతో మైనింగ్ వ్యతిరేక కార్యకర్తలను కాల్చి చంపడం; బీహార్‌లో ప్రజలపై కాల్పులు, హత్యలు; ఝూర్ఖండ్‌లో అక్రమ కబ్జా పేరుతో ప్రజలను విస్థాపితుల్ని చేసే ప్రభుత్వ చర్యల్ని వ్యతిరేకించే ప్రజలపై పోలీసు కాల్పులు, దౌర్జన్యం; పంజాబ్‌లో పత్రికా సంపాదకుడు, ప్రజా సంఘ నాయకుడు హర్బిందర్ సింగ్ జలాల్ అరెస్టు, చిత్రహింసలు; ఉత్తరప్రదేశ్‌లో పాలకవర్గాల బూటకపు అభివృద్ధి నమూనాను వ్యతిరేకిస్తున్న రైతాంగంపై నిర్బంధకాండ, మహారాష్ట్రలో దళిత ఉద్యమ కార్యకర్త, పత్రికా సంపాదకుడు సుధీర్ ధవళేను రాజద్రోహం కేసులో అరెస్టు చేయడం; ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక తెలంగాణా వుద్యమంపై వివిధ రూపాల్లో సాగుతున్న నిర్బంధం వంటివి మచ్చుకు కొన్ని వుదాహరణలు.

దేశ సంపదల్ని సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదార్ల కార్పొరేట్ సంస్థలకు కట్టుబెట్టడం కోసం కంకణం కట్టుకున్న భారత పాలకవర్గాలు ఇందుకు అతి పెద్ద అడ్డంకిగా వున్న మావోయిస్టు వుద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో ఇప్పుడు ఈ అన్యాయమైన యుద్ధంలోకి సైన్యాన్ని దించింది. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో సైనిక బలగాలు 'శిక్షణ' పేరుతో రంగంలోకి దిగాయి. దేశ సరిహద్దుల్లో శత్రు దేశాల సైన్యాలతో పోరాడుతుందని చెప్పే భారత సైన్యాన్ని ఇప్పుడు దేశం నడిబొడ్డున దేశప్రజలకు వ్యతిరేకంగా సాగుతున్న యుద్ధంలోకి ఈడుస్తున్నారు. సైనిక బలగాల శిక్షణ పేరుతో బస్తర్‌లోని మాడ్ ప్రాంతంలో 750 చదరపు కిలోమీటర్ల భూమిని అప్పజెప్పాలని రమన్‌సింగ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మాడ్ ప్రాంతంలో దాదాపు ఐదో వంతు భూభాగాన్ని కబళించివేస్తుంది. మరోవైపు కార్పొరేట్ కంపెనీల ప్రాజెక్టులు వేలాది ఎకరాల భూముల్ని కబళించే పథకాలతో ముందుకు వస్తున్నాయి. ఇలా విప్లవోద్యమ ప్రాంతాల్లో ప్రజల్ని బలవంతంగా నిర్వాసితుల్ని చేసే కుట్రలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి.

ఒకవైపు దేశంలో పెచ్చరిల్లిపోతున్న అవినీతి, కుంభకోణాల్లో కాంగ్రెస్, బీజేపీ తదితర పాలకవర్గ పార్టీల అవినీతికర నేతలు, కార్పొరేట్ బందిపోట్లు, బడా అధికారులు వేల, లక్షల కోట్ల రూపాయలు దిగమింగి దేశ ప్రజల అసహ్యానికి గురవుతున్నారు. అధికధరలు, ఆకలిచావులు, కరువు, అంటువ్యాధులు, విస్థాపన, వనరుల దోపిడీ వంటి సమస్యలతో కోట్లాది ప్రజలు సతమతమవుతున్నారు. ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కరించలేని ప్రభుత్వాలు న్యాయమైన ప్రజా వుద్యమాల్ని అణచివేసే లక్ష్యంతో ఫాసిస్టు నిర్బంధానికి, హత్యాకాండలకు పాల్పడుతున్నది. ప్రజల కోసం నిస్వార్థంగా, అంకితభావంతో, నిర్విరామంగా పని చేస్తున్న విప్లవ నేతలను జైలుపాలు చేస్తున్నది, హతమారుస్తున్నది. కామ్రేడ్ భూపేష్‌జీ అరెస్టు ఇందులో భాగమే.

కామ్రేడ్ భూపేష్‌జీ అరెస్టుకు నిరసనగా, విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పాలకవర్గాలు సాగిస్తున్న ఫాసిస్టు అణచివేతకు వ్యతిరేకంగా జూన్ 23న 24 గంటల పాటు జరిగే 'భారత్ బంద్'ను విజయవంతం చేయాల్సిందిగా మా కేంద్రకమిటీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది. ఈ బంద్ ప్రధానంగా 6 రాష్ట్రాల్లో – ఝూర్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలోని 3 జిల్లాలు – గడ్చిరోలి, చంద్రపూర్, గోందియాలలో, ఉత్తరప్రదేశ్ లోని బీహార్ సరిహద్దు జిల్లాల్లో, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో జరుగుతుంది. మిగతా రాష్ట్రాలలో వివిధ రూపాల్లో నిరసన సాగుతుంది. అయితే వైద్యం, విద్యార్థుల పరీక్షలు, ఇంటర్వ్యూలు వంటి అత్యవసర సేవల్ని ఈ బంద్ నుండి మినహాయిస్తున్నాం.

Abhay

**(అభయ్)**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**